క్లుప్తంగా

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

కొలిమిగుండ్ల: కనకాద్రిపల్లె ప్రధాన రహదారి సమీపంలో ఉన్న అయ్యప్ప స్వామి ఆలయ తొమ్మిదవ వార్షికోత్సవ వేడుకలను దాతల సహకారంతో బుధవారం ఘనంగా నిర్వహించారు. గర్భగుడిలోని అయ్యప్పస్వామి విగ్రహంతో పాటు ఆలయాన్ని పూలు, అరటి కొమ్మలతో అందంగా అలంకరించారు. వేద పండితులు ఆలూరి రాఘవేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో అభిషేకం, హోమంతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామపెద్దలు వీఆర్ రామిరెడ్డి, లక్ష్మిరెడ్డి స్వామికి పూజలు చేపట్టారు. భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు.

సన్మానం

బేతంచెర్ల: కర్నూలు జిల్లా అడిషనల్ ఎస్పీగా పదోన్నతి పొందిన హుస్సేన్ పీరాను బుధవారం బేతంచెర్ల నూర్ బాషా దూదేకుల సంఘం జిల్లా జాయింట్ సెక్రటరీ దస్తగిరి, మాబుసా, సభ్యు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు డాక్టర్ బాబాన్, దస్తగిరి, సభ్యులు చిన్న కాశీం, మౌలాలి, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు 'న్యాస్' పరీక్ష



అల్ట్రాటెక్‌లో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

కొలిమిగుండ్ల: పాఠశాల విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను అంచనా వేసేందుకు బుధవారం నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (న్యాస్) పరీక్ష నిర్వహించారు. మండలంలోని బెలుం ప్రాథమిక మెయిన్, మోడల్ స్కూల్, అల్ట్రాటెక్ స్కూల్‌లో 3,6,9 తరగతి విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. మూడు పాఠశాలలను ఎంఈఓ అబ్దుల్ కలాం పరిశీలించారు. ప్రతి తరగతి నుంచి 30 మంది విద్యార్థులను ఎంపిక చేశామని, ఈ పరీక్షల ఆధారంగా విద్యా ప్రమాణాలు ఎలా ఉన్నాయనేది తెలుస్తుందని చెప్పారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దివ్యాంగులు

కోవెలకుంట్ల: జిల్లాలో దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు దేవరాజు కోరారు. బుధవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన దివ్యాంగులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం చేరుకుని తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. దేవరాజు మాట్లాడుతూ అర్హులైన దివ్యాంగులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టించాలని, ఉచిత విద్యుత్, ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. దివ్యాంగులకు అంత్యోదయ కార్డులు మంజూరు చేయాలని, త్రీవీలర్ స్కూటీలు, బ్యాటరీ సైకిళ్లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం నాయకులు వెంకటేష్, పుల్లన్న, శ్రీనివాసరెడ్డి, కృష్ణారెడ్డి, ఉసేన్‌వలి, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

అవుకు ఎస్సార్బీసీ ఈఈకి అదనపు బాధ్యతలు



వెంకటసురేష్ బాబు

అవుకు: ఎస్సార్బీసీ అవుకు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న వెంకటసురేష్ బాబుకు హంద్రీనీవా సుజల స్రవంతి సర్కిల్–1 సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా పుల్ అడిషనల్ చార్జ్ అందిస్తూ ఉత్తర్వులు అందాయి. అక్కడ ఎస్ఈగా విధులు నిర్వహిస్తున్న రామ గోపాల్ సాధారణ బదిలీల్లో భాగంగా విశాఖపట్టణానికి వెళ్లారని, దీంతో అవుకు ఈఈకి అదనపు బాధ్యతలు అందిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. గురువారం బాధ్యతలు తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు.

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

బేతంచెర్ల: ఈనెల 6వ తేది నుంచి 2025 జనవరి 7వ తేదీ వరకు గ్రామాల్లోని రైతుల భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ప్రకాశ్ బాబు బుధవారం తెలిపారు. 6న ఆర్ కొత్తపల్లె, 10న కె. కొట్టాల, 12న కొలుములపల్లె, 13న సీతారామాపురం, 17న బేతంచెర్ల, 18న ముద్దవరం, 20 బుగ్గానిపల్లె, 21 గోరుమానుకొండ, 24న యంబాయి, 27 గూటుపల్లె, 28న ఆర్ ఎస్ రంగాపురం గ్రామాల్లో సదస్సులు ఉంటాయన్నారు. అదే విధంగా జనవరి 2న గోర్లగుట్ట, 3 అంబాపురం, 7న ఎం.పేండేకల్లు గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పండుగ వేళ సరుకుల్లో కోత!

- చౌక దుకాణాల ద్వారా కందిపప్పు సరఫరాలో కోత
- కొన్ని షాపులకే పంపిణీ
- క్రిస్మస్ పండుగ సమయంలో కోటా తగ్గించడంపై లబ్ధిదారుల ఆగ్రహం



బనగానపల్లెలోని సివిల్ సప్లై గిడ్డంగి



బెలుం గ్రామంలో కంది పప్పులేకుండా బియ్యం, చక్కెర పంపిణీ చేస్తున్న దృశ్యం

బనగానపల్లె రూరల్: రాష్ట్రంలో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమంలో కోత విధిస్తోంది. ప్రజలకు నిత్యావసరాలు సరఫరా చేసే పౌర సరఫరా వ్యవస్థపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. రేషన్ దుకాణాల ద్వారా కేవలం బియ్యం, చక్కెర అందజేస్తూ కందిపప్పులో కోత విధించింది. నిత్యావసర సరకులు ఆకాశాన్నంటుతున్న తరుణంలో క్రిస్మస్, నూతన సంవత్సర పండుగల సీజన్‌లో ప్రభుత్వం రేషన్‌దుకాణాల ద్వారా సరకుల్లో కోత పెట్టడంపై పేదలు కూటమి ప్రభుత్వంపై మండిపడుతున్నారు.

45–50 శాతం మాత్రమే సరఫరా..

బనగానపల్లె సివిల్ సప్లై గిడ్డంగి పరిధిలో బనగానపల్లె, అవుకు, కొలిమిగుండ్ల మండలాల్లోని రేషన్‌దుకాణాలు ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం 53,766 మంది కార్డుదారులు ఉన్నారు. ఈ గిడ్డంగికి డిసెంబరు నెలకు సంబంధించి 860 టన్నులు బియ్యం, చక్కెర 26 టన్నులు, జొన్నలు 52 టన్నులు వందశాతం వచ్చాయి. కందిపప్పు 54 టన్నులు రావాల్సివుండగా 39 టన్నులు మాత్రమే వచ్చింది. వచ్చిన కొద్దిపాటి కంది పప్పును బనగానపల్లె మండలంలోని అన్ని గ్రామాల కార్డుదారులకు వందశాతం, అవుకు, కొలిమిగుండ్ల మండల కేంద్రాల్లోని లబ్ధిదారులకు మాత్రమే పంపిణీ చేసే విధంగా డీలర్లకు సరఫరా చేసి గ్రామీణ ప్రాంత ప్రజలకు మొండి చేయి చూపించారు. బనగానపల్లె నియోజకవర్గంలోని రేషన్‌కార్డుదారుల్లో 45-50 శాతం మాత్రమే కందిపప్పు సరఫరా చేసి మిగతా వారికి కోత విధించారు. ఈ సమస్య జిల్లా వ్యాప్తంగా ఉన్నట్లు సమాచారం.

పండుగ సీజన్‌లోనూ కోతే..

ప్రస్తుతం మార్కెట్‌లో కంది పప్పు కిలో రూ.160 నుంచి 180ల వరకు ధర ఉంది. దీంతో మార్కెట్‌లో కందిపప్పు కొనుగోలు చేయాలంటే పేదలు ఆందోళన చెందుతున్నారు. క్రిస్మస్ పండుగతో పాటు నూతన సంవత్సర పర్వదినం ఉండడంతో క్రైస్తవులతో పాటు అన్నివర్గాల ప్రజలు ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పండగ సీజన్‌లో వంద శాతం కంది పప్పు చేయాల్సిన ప్రభుత్వం ఇలా అరకొరగా పంపిణీ చేయడం పట్ల లబ్ధిదారులు మండిపడుతున్నారు. వందశాతం కంది పప్పు సరఫరా చేయాలని కోరుతున్నారు.



ప్రభుత్వం సరఫరా చేసిన కంది పప్పు

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పంపిణీ చేశాం

డిసెంబరు నెలకు సంబందించిన నిత్యవసర సరకుల్లో కంది పప్పు తక్కువగా రావడం జరిగింది.వచ్చిన కంది పప్పును ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలాలకు పంపిణీ చేశాం. బనగానపల్లె మండలంలో వంద శాతం కార్డుదారులకు, అవుకు, కొలిమిగుండ్ల పట్టణాల్లో ఉన్న రేషన్‌కార్డుదారులకు మాత్రమే వంద శాతం కందిపప్పు సరఫరా చేశాం.మరో విడత కంది పప్పురాగానే మిగిలిన రేషన్‌కార్డుదారులకు కూడ పంపిణీ చేస్తాం.

–బాలీశ్వరరావు, సివిల్ సప్లయి గౌడౌన్ ఇంచార్జీ,బనగానపల్లె

సూర్య ఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఈ నాగేంద్ర

డోన్ టౌన్ : విద్యుత్ బిల్లును తగ్గించుకుని ఆదాయం పొందడానికి సూర్య ఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఈ నాగేంద్ర పేర్కొన్నారు. స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయం ఆవరణలో బుధవారం సూర్య ఘర్ పథకంపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం ప్రయోజనాలపై విద్యుత్ వినాయోగదారులకు అవగాహన కల్పించాలన్నారు. ఇంటిపై 10 చదరపు మీటర్ల విస్తీర్ణంలో సోలార్ సిస్టం ఏర్పాటు చేసుకుంటే విద్యుత్‌ను ఉచితంగా వినియోగించుకోవడంతో పాటు నెట్‌మీటరింగ్ ద్వారా అమ్ముకోవచ్చన్నారు. మూడు కిలోవాట్ల విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటుకు రూ.1.45లక్షలు అవుతుందని, రూ.78 వేలు సబ్సిడీ ఉంటుందన్నారు. సమావేశంలో రూరల్ ఏఈ నాగేశ్వరరెడ్డి, జేఈలు నాగరాజు, శివ, కుషిధర్, లైన్ ఇన్‌స్పెక్టర్లు సుబ్రమ్మణ్యం, వెంకటేశ్వర్లు,రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పశుగ్రాసం పెంపకంపై అవగాహన పెంచాలి



మాట్లాడుతున్న పశుసంవర్ధకశాఖ ఉపసంచాలకులు డాక్టర్ డీవీ రమణయ్య

బనగానపల్లె రూరల్ : జాతీయ ఉపాధి హామీ పథకం కింద పశుగ్రాసం పెంపకంపై రైతుల్లో అవగాహన పెంచాలని పశుసంవర్ధకశాఖ ఆళ్లగడ్డ డివిజన్ ఉపసంచాలకులు డాక్టర్ డీవీ రమణయ్య సూచించారు. బుధవారం స్థానిక పశువైద్యశాలలో బనగానపల్లె, అవుకు మండలాలకు చెందిన పశువైద్యులు సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పథకం ద్వారా రైతులు తమకు ఉన్న కొదిపాటి స్థలంలోనే పశుగ్రాసం సాగు చేసుకోవచ్చని, సుమారు 10 నుంచి 50 సెంట్ల స్థలంలో సాగు చేసుకునే అవకాశం ఉందన్నారు. మెటీరియల్ ఖర్చు మొత్తం ఎస్ఆర్‌జీఎస్ పథకం ద్వారా ప్రభుత్వమే చెల్లిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యులు బ్రహ్మానందరెడ్డి, రామ్‌కుమార్‌రెడ్డి, రాఘవేంద్రారెడ్డి, చిన్నబాబు, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్‌పై విచారణ

కోవెలకుంట్ల: మండలంలోని రేవనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు సతీష్‌కుమార్ సస్పెన్షన్‌పై జిల్లా విద్యాశాఖ అధికారులు విచారణ జరుపుతున్నారు. పాఠశాలలో పనిచేసిన హిందీ ఉపాధ్యాయుడు సతీష్‌కుమార్ సమాచార హక్కు చట్టం దుర్వినియోగం, పాఠశాల రికార్డుల మార్పిడి, ట్యాంపరింగ్ చేశారనే ఆరోపణలతో 2022వ సంవత్సరం నవంబర్ నెలలో అప్పటి హెచ్ఎం రామచంద్రారెడ్డి సిఫారసు మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులు సస్పెండ్ చేశారు. ఈ విషయంపై సతీష్‌కుమార్ అప్పట్లో విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ ఘటనపై విచారణ జరపాలని విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ చౌడేశ్వరి, సి.బెళగల్ ఎంఈఓ ఆదాంబాషాను కడప ఆర్జేడీ నియమించారు. ఈ మేరకు విచారణాధికారులు పాఠశాలలో అప్పట్లో పనిచేసిన హెచ్ఎం రామచంద్రారెడ్డి, సతీష్‌కుమార్, ప్రస్తుత హెచ్ఎం సుందరయ్య, రికార్డు అసిస్టెంట్ సోమశేఖర్‌లను విచారించారు.

ఏకపక్ష నిర్ణయాలు తగవు

- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న మున్సిపల్ కమిషనర్
- ఏకపక్షంగా లీగల్ అడ్వైజర్ నియామకం
- మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో చైర్మన్, కౌన్సిలర్ల ఆగ్రహం



కమిషనర్ నిర్ణయాల పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్న చైర్మన్ సప్తశైల రాజేష్



కమిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు

డోన్ : డోన్ మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, అధికార పార్టీ నాయకులకు తొత్తుగా మారాడని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్‌తో పాటు మున్సిపల్ వైస్‌చైర్మన్ జాకీర్‌హుసేన్, కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. పాలకవర్గ సభ్యులను పరిగణలోకి తీసుకోకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని, తమ ఆమోదం లేకుండా లీగల్ అడ్వైజర్ నియామకం తగదని కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో మున్సిపల్ లీగల్ అడ్వైజర్ నియామకాన్ని కూడా వారు తీవ్రంగా వ్యతిరేకించారు. కౌన్సిల్ ఆమోదం లేకుండా ఎలా నియమిస్తారని వారు కమిషనర్ ప్రసాద్‌గౌడ్‌ను నిలదీశారు. జిల్లాలోనే ఆదర్శ మున్సిపాలిటీగా ఉన్న డోన్‌ను కమిషనర్ ఏకపక్ష నిర్ణయాలతో భ్రష్టు పట్టిస్తున్నారని కౌన్సిలర్లు టమటం లక్ష్మి, మిట్టా ఉమామహేశ్వరి, సుమలత సురేష్, వెంకటేశ్వరమ్మ, మేకల విమల, షేక్ ఇంతియాజ్, పాలుట్ల మీనాక్షీ అసహనం వ్యక్తం చేశారు.

మాజీ మంత్రినే అవమానించిన ఘనుడు కమిషనర్...

డోన్‌ను అన్నివిధాలుగా అభివృద్ధి చేసిన మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డినే అవమానించిన ఘనుడు కమిషనర్ అని కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. వాకింగ్ చేయడానికి కార్యాలయం ఆవరణలోకి వస్తే తాళం వేసి గతంలో కమిషనర్ అవమానించారని చైర్మన్ సప్తశైల రాజేష్ గుర్తుచేశారు. ఒంటెద్దు పోకడ అనుసరిస్తున్న కమిషనర్ ప్రసాద్‌గౌడ్ తీరు ప్రజాస్వామ్యానికే మాయని మచ్చ అని ఆక్షేపించారు. పార్టీలతో ప్రమేయం లేకుండా తాము ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డిని గౌరవించి ఆయన మాట ప్రకారం వెనకబడిన ప్రాంతాల అభివృద్ధికి రూ.కోటి నిధులను కేటాయించిన విషయాన్ని కూడా ఆయన గుర్తుచేశారు. లీగల్ అడ్వైజర్ నిర్ణయాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, ఏకపక్షంగా నియమించిన కమీషనర్, మేనేజర్‌ల వైఖరిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నామని హెచ్చరించారు.

అసంబద్ధ నిర్ణయాలు ఉపసంహరించుకోవాలి



బనగానపల్లె ఎంఈఓ స్వరూపకు వినతి పత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు



ప్యాపిలి ఎంఈఓకు వినతిపత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

బనగానపల్లె రూరల్ : విద్యాశాఖ తీసుకున్న అసంబద్ధ నిర్ణయాలు వెంటనే వెనక్కి తీసుకోవాలని యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు సత్యప్రకాష్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం స్థానిక విద్యాశాఖ కార్యాలయం ఎదుట యూటీఎఫ్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం పాఠశాలల పనివేళల పెంపు, 10 శాతం మంది ఉపాధ్యాయులు మాత్రమే సెలవుపెట్టాలన్న నిబంధన, 10వ తరగతి విద్యార్థుల సంసిద్ధత పేరుతో నూరురోజుల యాక్షన్‌ప్లాన్, విద్యార్థుల వివరాలు అపార్‌లో నమోదు చేయలేదని కడప జిల్లాలో 829 మంది హెచ్ఎంలకు షోకాస్ నోటీసులు జారీ చేయడం వంటి అసంబద్ధ నిర్ణయాల వల్ల ఉపాధ్యాయులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నట్లు తెలిపారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను ఎంఈఓలు స్వరూప, శ్రీనివాసులుకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అడిట్ కన్వీనర్ దస్తగిరి, బి సుధాకర్, కృష్ణయ్య, సతీష్ కుమార్, సన్నన్న, గోపాల్, పీఎండీ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయాలతో ఉపాధ్యాయులకు ఇబ్బందులు

ప్యాపిలి: విద్యాశాఖ అధికారులు తీసుకుంటున్న అసంబద్ధ నిర్ణయాలతో ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షులు శాంతిప్రియ, జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం ఎంఈఓ వెంకటేశ్ నాయక్‌కు యూటీఎఫ్ నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సభ్యులు అబ్దుల్ లతీఫ్, మండల అధ్యక్షుడు రమేశ్ నాయుడు, నాయకులు ఆంజనేయ ప్రసాద్, రాజేంద్ర, మాదన్న, ఆస్మాబేగం, శిరీష, మహబూబ్ బాషా, వెంకటరమణ, మహమ్మద్ అలీ, కౌసర్ పాల్గొన్నారు.

డోన్ టౌన్ : విద్యాశాఖ ఉన్నతాధికారులు తీసుకున్న అసంబద్ధ నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మీనాయక్, గోపాల్, జిల్లా సాంస్కృతిక విభాగం కన్వీనర్ సంజీవరాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం డోన్ ఎంఈఓ ప్రభాకర్‌కు నాయకులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రసాద్, రియాజ్, శ్రీనివాసులు, సుమన్, భార్గవి, మనోహర్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ఇళ్లస్థలాలు ఇవ్వాలి

అవుకు: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లస్థలాలు మంజూరు చేయాలని ఏఐటీయూసీ మండల నాయకుడు నాగాంజనేయులు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ సువర్ణాదేవికి వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు పేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పేద ప్రజల ఇళ్ల నిర్మాణానికి ఇచ్చే రూ.2.5లక్షలు ఏమాత్రం సరిపోవని రూ.5లక్షలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు బండి వెంకటేశ్వర్లు, నమ్యానాయక్, హుస్సేని, మధు తదితరులు పాల్గొన్నారు.

హిందువులకు రక్షణ కల్పించాలి



నిరసన తెలుపుతున్న హిందువులు

బేతంచెర్ల: బంగ్లాదేశ్‌లో హిందూ సోదరులకు రక్షణ కల్పించాలని హిందూ ధార్మిక సంఘాల నాయకులు నాగ మోహన్, నాగరాజు, హరి, విశ్వనాథ్‌రెడ్డి, పుల్లారెడ్డి, రామూర్తి, శేఖరయ్య ప్రభుత్వాన్ని కోరారు. బంగ్లాదేశ్‌లో ఆలయాలు, హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా బేతంచెర్ల పట్టణంలో హిందూ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఆంజనేయ స్వామి ఆలయం నుంచి పురవీధుల మీదుగా పాతబస్టాండ్ వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో హిందూవులపై ముస్లింలు దాడిచేయడం సమంజసం కాదన్నారు. ఇప్పటికైనా బంగ్లాదేశ్ ప్రభుత్వం జోక్యం చేసుకొని హిందువులతోపాటు ఆలయాలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి



వర్షానికి దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి డాక్టర్ వైవీ మురళీకృష్ణ



పొగాకు పంటను పరిశీలిస్తున్న ఏడీఏ అశోక్ వర్ధన్‌రెడ్డి

బనగానపల్లె : రైతులు అధిక దిగుబడులు సాధించేందుకు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి డాక్టర్ వైవీ మురళీకృష్ణ అన్నారు. మండలంలోని చెరువుపల్లె గ్రామంలో బుధవారం స్థానిక వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందించారు. వ్యవసాయశాఖ ద్వారా అమలవుతున్న పలు పథకాల గురించి వివరించారు. అలాగే పండ్లాపురం గ్రామంలో కురిసిన అకాల వర్షానికి దెబ్బతిన్న వరి పంటను పరిశీలించారు. అనంతరం ఆయన పట్టణంలోని పవన్ ఫర్టిలైజర్స్, సత్యం కెమికల్స్ అండ్ ఫర్టిలైజర్స్ షాపులను తనిఖీ చేసి, నిల్వలను పరిశీలించారు. ఆ తరువాత అవుకు మండలంలోని గుండ్ల శింగవరం మొక్కజొన్న రైతుల ఫిర్యాదు మేరకు బనగానపల్లెలో ఉన్న లలిత ట్రేడర్స్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి విత్తనం ద్వారా వచ్చే సమస్యలను ఆ గ్రామ రైతులకు వివరించారు. కార్యక్రమంలో నంద్యాల డివిజన్ వ్యవసాయాధికారి రాజశేఖర్, సిబ్బంది ఉన్నారు.

వరి రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

అవుకు: వరి పంట కోత దశలో ఉన్నందున రైతులు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని అవుకు ఏఓ అబ్దుల్ హక్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో పొలంలో నీరు నిల్వవుండకుండా తీసివేయాలని, గాలులకు నేలవాలిన వరి పంటలో ధాన్యం గింజలు నీటిలో తడవకుండా పైరును కట్టలుగా కట్టుకోవాలని చెప్పారు. అలాగే వర్షాలకు తడిచిన ధాన్యం గింజలు మొలకెత్తకుండా 5శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలని సూచించారు. అలాగే పంట బీమా కోసం రైతులు తమ వాటా ప్రీమియంను చెల్లించాలన్నారు.

సాగులో మెలకువలు పాటించాలి

డోన్ రూరల్ : సాగులో రైతులు మెలకువలు పాటించాలని, అప్పుడే మంచి దిగుబడులు సాధిస్తారని ఏఓ అబ్దుల్‌షఫీ సూచించారు. మండల పరిధిలోని వెంకటాపురం, అబ్బిరెడ్డిపల్లి గ్రామాలలో బుధవారం ఏఓ పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పంట పొలాలకు వెళ్లి వేరు శనగ పైరును ఏఓ పరిశీలించారు. రైతులకు సూచనలు చేశారు. అదేవిధంగా రబీలో సాగు చేసిన పంటలకు బీమా చేసుకునే విధాన్ని వివరించారు. రైతులే ప్రీమియం చెల్లించాలని, అప్పుడే బీమా వర్తిస్తుందని ఏఓ వివరించారు. కార్యక్రమంలో ఉద్యాశాఖ అధికారి వెంకటారాముడు, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణకు చర్యలు చేపట్టాలి

బేతంచెర్ల: తెగుళ్ల నుంచి పంటలను కాపాడుకునేందుకు సకాలంలో రైతులు నివారణ చర్యలు చేపట్టాలని డోన్ వ్యవసాయ శాఖ ఏడీ అశోక్ వర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఆర్ కొత్తపల్లె, గూటుపల్లె గ్రామంలో ఏఓ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఏడీ రైతులు రబీలో సాగు చేసిన ఉలవ, పొగాకు, జొన్న, మినుము, శనగ, వేరుశనగ, పెసర పంటలను పరిశీలించారు. తెగుళ్ల నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. రబీలో సాగు చేసిన పంటలకు సంబంధించి రైతులే బీమా ప్రీమియం చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ బెన్నిరాజు, మహమ్మద్, అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు ప్రఖ్యాతి, రాజు నాయక్, ఎంపీఈఓ బాల కృష్ణ పాల్గొన్నారు.

యజమానులపై చట్టపరమైన చర్యలు తప్పవు

బేతంచెర్ల: ఆవులను ఇళ్ల దగ్గరే ఉంచుకోవాలని, పందులను పట్టణానికి దూరంగా తరలించాలని, లేని పక్షంలో యజమానులపై చట్టపరమైన చర్యలు తప్పవని నగర పంచాయతీ కమిషనర్ హరి ప్రసాద్ హెచ్చరించారు. పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో వెటర్నీ ఏడీ వసంతలక్ష్మి, ఏఎస్ఐ లింగమయ్య ఆధ్వర్యంలో ఆవులు, పందుల యజమానులు, రైతు సంక్షేమ సంఘం సభ్యులతో గురువారం నిర్వహించిన సమావేశంలో కమిషనర్ మాట్లాడారు. పట్టణంలో పందులు, ఆవులు ఇష్టరాజ్యంగా సంచరిస్తున్నందున ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆవులు రోడ్డుపైకి వస్తే గోశాలకు తరలిస్తామన్నారు. అదేవిధంగా పందులను పట్టణానికి దూరంగా షెడ్లలో ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతు సంక్షేమ సంఘం నాయకులు శ్రీధర్‌రెడ్డి, రమణారెడ్డి, భూషి రెడ్డి పాల్గొన్నారు.

ప్రశాంతంగా రైల్వే ట్రేడ్ యూనియన్ ఎన్నికలు



ఓటు వేసేందుకు క్యూలో నిల్చున్న రైల్వే ఉద్యోగులు

డోన్ రూరల్ : పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో బుధవారం రైల్వే ట్రేడ్ యూనియన్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 6గంటల నుంచే రైల్వే ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా పోలీసులు ముందస్తు చర్యలు తీసుకున్నారు. ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు కలుగ కుండ స్వచ్చందగా పాల్గొనేలా పట్టణ సీఐ.ఇంతియాజ్ పర్యవేక్షించారు. భారీ బందోబస్తు ఏర్పాటు చేయించారు. డ్రోన్ కెమరాలు ఏర్పాటు చేశారు. మూడు రోజుల పాటు జరిగే ఈఎన్నికలు ప్రశాతంగా నిర్వహించుకోవాలని మజ్దూర్, ఎంప్లాయీస్ సంఘ్ నాయకులకు సీఐ సూచించారు. డోన్ రైల్వే స్టేషన్ పరిధిలో మొత్తం 650 ఓట్లు ఉన్నాయి. పత్తికొండ మండలంలోని తుగ్గలి నుంచి బేతంచెర్ల మండలంలోని రంగాపురం వరకు డోన్ రైల్వే స్టేషన్ పరిధిలోకి వస్తుంది. 260 ఓట్లు పోలింగ్ అయినట్లు సమాచారం.

భూ సమస్యల పరిష్కారానికి కృషి

అవుకు: భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తహసీల్దార్ సువర్ణా దేవి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో భూ సమస్యలపై ఫిర్యాదులు సేకరించేందుకు ఈనెల 6వ తేదీ నుంచి రెవెన్యూ గ్రామసభలు ప్రారంభమవుతాయని తెలిపారు. 6న రామాపురం, 7న సంగపట్నం, 10న చనుగొండ్ల, 11న సుంకేసుల, 12న అవుకు, 13న గుండ్లశింగవరం, 17న రామవరం, 18న జూనూతల, 19న ఉప్పలపాడు, 20న కునుకుంట్ల, 21న మంగంపేట, 24న అన్నవరం, 26న వేములపాడు, 27న నిచ్చెనమెట్ల, 28న మెట్టుపల్లె, 31న చెన్నంపల్లె, జనవరి 02న శివవరం, 03న శింగనపల్లె, 04న చెర్లోపల్లె గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు సదస్సులు నిర్వహిస్తామన్నారు.

7న మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం

అవుకు: అవుకు ఆదర్శ పాఠశాలలో ఈనెల 7వ తేదీన మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ హెమీమా బుధవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధాయుల మధ్య సంబంధాలు బలపడితేనే ప్రభుత్వ పాఠశాలలు మరింత అభివృద్ధి చెందుతాయన్నారు. విద్యార్థుల ప్రగతి గురించి వారి తల్లిదండ్రులతో చర్చించి, ఎలాంటి సహకారాన్ని వారి పిల్లలకు అందించాలో వివరిస్తామని తెలిపారు.